క్లుప్తంగా

వేలం ఆదాయం రూ.2.35 లక్షలు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు అమ్ముకోవడానికి, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడానికి గురువారం ఉదయం నిర్వహించిన వేలంతో రూ.2.35 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు ద్వారా రూ.1.53 లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు ద్వారా రూ.82 వేలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ

కందుకూరు అర్బన్: పట్టణ పరిధిలోని ప్రశాంతికాలనీలో గురువారం సీపీఐ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నా పేద ప్రజలు, కార్మిక, కర్షకులకు అండగా ఉండే పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయం నడుస్తుందని, బీజేపీని పేదలు భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. దుర్మార్గాలను, దౌర్జన్యాలను సీపీఐ కార్యకర్తలు ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నత్త రామారావు, సింగయ్య, మధు పాండు, మహేష్, మోషే తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు. గురువారం ఉదయం మండలంలోని అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి ఇసుక తరలిస్తున్న వలేటివారిపాలెం, జెడ్ ఉప్పలపాడు గ్రామాలకు చెందిన ట్రాక్టర్లు, డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్లు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీకి చెందిన మద్దెల సుధాకర్‌కు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలులోని క్యాంప్ కార్యాలయంలో రూ.55 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ నాసిర్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా విజయలక్ష్మి

కందుకూరు: కందుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఒంగోలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న విజయలక్ష్మిని ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సుల్తాన్‌బాషాను ఒంగోలు ఆడిట్ విభాగానికి బదిలీ చేశారు. ఆయనతో పాటు సీనియర్ అసిస్టెంట్ శోభను ఒంగోలు ఆడిట్ విభాగానికి, అక్కడ పనిచేస్తున్న నరశింగరావును కందుకూరుకు బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్‌ను అమ్మనబ్రోలుకు, అక్కడ పనిచేస్తున్న అరుణను కందుకూరుకు బదిలీ చేశారు. అటెండర్ ఫయాజ్‌ను ఇంకొల్లుకు బదిలీ చేశారు. ఇటీవల కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు రెండు రోజులపాటు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు అవినీతి కార్యక్రమాలు వెలుగులోకి వచ్చారు. దీంతో నలుగురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

లబ్ధిదారులకు అవగాహన

లింగసముద్రం: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో ఎంపీడీఓ శేషుబాబు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మొగిలిచర్ల జగనన్న లేఅవుట్‌లో 49 మందికి, ఆర్‌ఆర్ పాలెంలో 26 మందికి, యర్రారెడ్డిపాలెంలో 23 మంది లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లల్లో లబ్ధిదారులే ప్రభుత్వం ఇచ్చే నిధులతో సొంతంగా ఇళ్లు నిర్మించుకోవచ్చన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో కాకుండా స్వంతంగా నిర్మించుకుంటే నాణ్యంగా ఇంటిని నిర్మించుకోవచ్చన్నారు.

సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు



ఉపన్యాసంలో మాతాజీ

కనిగిరి రూరల్: స్థానిక సాయిబాబా దేవస్థానంలో విశుద్దానంద భారతి మాతాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయి సచ్చరిత సప్త సప్తాహ పారాయణ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ 49 రోజులు బాబా ఆలయంలో సాయి సచ్చరిత్రను భక్తులు పారాయణం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, కేటీఆర్ టెక్నో స్కూల్ అధినేత కుందురు తిరుపతిరెడ్డి, బాబా గుడి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, గుత్తి శ్రీధర్, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, పెన్నా వెంకటేశ్వర్లు, టంగుటూరి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో ప్రముఖులు



షిర్డీ సాయిబాబా స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



ఇమ్మడిచెరువులో శ్రీసాయిబాబా విగ్రహ ప్రతిష్టలో చింతలచెరువు, ఉడుముల శ్రీనివాసులురెడ్డి

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువులో షిర్డీ సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని స్వామికి కోరుకున్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ, జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వై నాగూర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో సాయినాథున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ, జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డిలు రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డిని, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దుగ్గపల్లి సర్పంచ్ రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరంరెడ్డి బ్రహ్మరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలే గోపాల్‌రెడ్డి ల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



మార్గమధ్యలో తెగిపడిన హైపర్‌టెన్షన్ వైర్

పీసీపల్లి: విద్యుత్ వైరు తెగిపడడంతో అరగంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయిన సంఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని పీసీపల్లి -అలవలపాడు మార్గమధ్యలో ఉన్న హైపర్‌టెన్షన్ వైరు (11కేవీ) వైరు తెగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ సమయంలో రోడ్డుపైన రాకపోకలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. అధిక విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ వైరు తెగిపడి మంటలు రావడంతో అరగంట పాటు వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్‌ను నిలిపివేసి సదరు తెగిపోయిన హైటెన్షన్ వైరును తొలగించారు. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

టిప్పర్ బోల్తా

ఉలవపాడు: ప్రమాదవశాత్తు టిప్పర్ బోల్తా పడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జాతీయరహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ వద్ద గురువారం ప్రమాదం జరిగింది. వివరాలు.. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్ రాళ్లతో వెళుతున్న టిప్పర్ వాహనం ఉలవపాడు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. టిప్పర్ నడుపుతున్న డ్రైవర్ రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రునికి హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. టిప్పర్‌లోని రాళ్లు ఒంగోలు వైపు వెళ్లే రోడ్డు మీద పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. హైవే సిబ్బంది వచ్చి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

దాడిచేసి గాయపరచిన వారిపై కేసు

చినగంజాం: ఇరువురిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై సురేష్ వివరాల మేరకు.. మండలంలోని పెదగంజాం పంచాయతీ బుచ్చిగుంట గ్రామానికి చెందిన నిర్మలమ్మ, పవన్‌కుమార్‌లపై ఈనెల 9వ తేదీ రాత్రి శేషయ్య, మరియదాసు, అనిల్, వినోద్‌లు దాడి చేశారు. గ్రామంలో సిమెంట్ బల్లను నిర్మలమ్మ, పవన్‌కుమార్‌లు తీసుకొని వెళ్లి వారి దుకాణం వద్ద వేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన ఆ నలుగురు బల్ల తీసుకొని వెళ్లి మీరు వేసుకుంటారా అంటూ వాదనకు దిగి వారిపై దాడి చేసి గాయపరచారు. దాంతో బాధితులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాసవీ కుటుంబ రక్ష పథకం ద్వారా ఆర్థిక సాయం

అద్దంకి రూరల్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో వాసవీ కుటుంబ సురక్ష పథకం ద్వారా ఇంకొల్లుకు చెందిన కూనిశెట్టి నాగరాజుకు గురువారం అద్దంకిలోని వాసవిక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ నివాసంలో రూ. 3.40 లక్షలు చెక్ అందజేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు క్లబ్ జోన్ చైర్మన్ దొగిపర్తి అప్పయ్య, ఊటుకూరి శ్రీనివాసరావు, చుండూరి సాంబశివరావు, ఆత్మకూరి ఆంజనేయులు, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ పాల్గొన్నారు.

వాహనదారులు పత్రాలు కలిగి ఉండాలి

పుల్లలచెరువు: వాహనదారులు తప్పని సరిగా ప్రభుత్వం నిర్దేశించిన పత్రాలను కలిగి ఉండాలని పుల్లలచెరువు ఎస్‌ఐ శ్రీహరి వాహనదారులకు సూచించారు. గత మూడు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వాహనదారులకు తప్పని సరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, చిన్న పిల్లలకు ట్రాక్టర్లు, మోటార్ వాహనాలు ఇచ్చినట్లుగా ఉంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని వాహనదారులకు అవగాహన కల్పించారు. కూలీల ఆటోలు అధిక లోడు, మితిమీరిన వేగంగా వెళ్లరాదని సూచించారు. పత్రాలు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

పృథులగిరి రోడ్ అభివృద్ధిపై ఎంపీ స్పందన అభినందనీయం

● ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండపై తారురోడ్డు నిర్మాణానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించడం అభినందనీయమని ప్రకాశం, నెల్లూరు, పల్నాడు జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ కోఆర్డినేటర్, ఎంపీపీ వాకా వెంటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పొదిలి నుంచి మర్రిపూడి మండలం ఎస్టీ రాజుపాలెం గ్రామం మీదుగా మర్రిపూడి వరకు సుమారు 10.8 కిలోమీటర్లు బీటీరోడ్ నిర్మించాలని దిశ సమావేశంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి విన్నవించగా.. రూ.8.5కోట్లతో అంచనాలు రూపొందించి, వర్క్ ఆర్డర్ రిలీజ్ చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈని ఎంపీ ఆదేశించారని వివరించారు. కాంట్రాక్టర్ల కారణంగా మర్రిపూడి-పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం నిలిచిందని, మర్రిపూడి చెరువుకట్ట కింద ప్రమాదకరంగా ఉన్న నేల బావులను పూడ్చాలంటూ ఇచ్చిన నివేదికను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేక గ్రాంట్‌లో పెట్టి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. మర్రిపూడి మండలంలో టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు కుమ్మక్కై ఒక్కో కూలీ వద్ద వారానికి రూ.200 చొప్పున తీసుకుంటున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విచారిస్తామన్నారు. దిశ సమావేశంలో మండల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



పాకలలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మ

సింగరాయకొండ: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీకి ఆదాయం పెరిగేలా చూడాలని పంచాయతీ సిబ్బందికి ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ సూచించారు. మండలంలోని పాకల, మూలగుంటపాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. సింగరాయకొండ పంచాయతీలోని సాయిబాబా గుడి వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించి, పంచాయతీ అనుమతి మేరకు నిర్మించుకోవాలని స్పష్టం చేశారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



నర్రమారెళ్లలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, దళితులు

పామూరు: మండలంలో దళితుల భూములు కాజేసిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మండలంలోని నర్రమారెళ్లలో దళితులు, పలువురు గ్రామస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నర్రమారెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇనిమెర్ల రెవెన్యూ పరిదిలోని నర్రమారెళ్ల, గుమ్మనంపాడు, వగ్గంపల్లె రెవెన్యూ గ్రామాల్లో పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ఆక్రమించుకుంటుంటే పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని దళిత సంఘ నాయకుడు, వైస్ ఎంపీపీ గంధం యేసురత్నం, గంధం సాల్మాను, ఇసాక్, గుంటుపల్లి చెంచురామయ్య అన్నారు. ఆక్రమణలకు గురైన భూములపై జిల్లా అధికారులు పలు సూచనలు చేసినా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణం భూఆక్రమణలను తొలగించి ఆక్రమణలకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకుని ఆ భూమిని దళితులకు పంపిణీచేయాలన్నారు.

పొగాకు అనధికార విక్రయం నేరం



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: పొగాకు అనధికార విక్రయం, కొనుగోలు చట్టరీత్యా నేరమని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కోల్డ్ స్టోరేజీల్లో బేళ్లు ఉంచిన రైతులు పూర్తి వివరాలు తెలియజేసి, బోర్డు అనుమతితో వేలానికి తీసుకురావాలని స్పష్టం చేశారు. గురువారం కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాల రైతులు 876 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 837 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.198.29 పలికింది. వేలంలో మొత్తం 21 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

164 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా గురువారం నందనవనంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 164 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఎన్ఎం హైమావతి, ఎంఎల్‌హెచ్‌పీ క్రిష్ణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు పథకం వరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధుల పాలిట వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో కాశిరెడ్డి కాలనీలో గురువారం కంటి వెలుగు కార్యమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటి వెలుగు పథకం ద్వార ఎందరో పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేయిస్తున్నట్లు చెప్పారు. 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ లక్ష్మీ, ఆశా కార్యకర్తలు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు అవగాహన

సింగరాయకొండ: మండలంలోని జగనన్న లేఔట్లలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు హౌసింగ్ డే సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయిలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. లబ్ధిదారులు హాజరై ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పంచముఖ ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

బేస్తవారిపేట: మండలంలోని ఒందుట్ల బృగుమహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణములో శ్రీకృష్ణుడు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, గణపతిపూజ, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో నాగులపుట్ట వీరాంజనేయస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి తమలపాకులతో ఆకు పూజ, పంచామృతాభిషేకం, నిర్వహించారు. అర్చకులు నారాయణం త్రివిక్రమ ప్రసాద్, రాఘవాచార్యులు స్వామివారికి సహస్ర నాగవల్లీ దళార్చన పూజ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

14న హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న ఆంజనేయాస్వామి గుడి నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శిరసనగండ్ల శ్రీనివాసులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో 11వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో గురువారం శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఈశ్వరరెడ్డి, లక్ష్మి, విష్ణువర్ధన్‌రెడ్డి, రత్నకుమారి, చెంచిరెడ్డి, గీతాంజలి దంపతులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సప్తాహ మహోత్సవాల సందర్భంగా నిత్యం రామనామ సంకీర్తనలు ఆలపిస్తున్నారు. శుక్రవారం సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెంకటరామకృష్ణాచార్యులు, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.



శ్రీవారి కల్యాణంలో ఉభయదాతలు

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ



ఉపాధి అక్రమాలపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ముండ్లమూరు: మండలంలోని బృందావనం తండా పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో జరిగిన అక్రమాలపై ఎంపీడీఓ కె. కుసుమకుమారి గురువారం విచారణ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మండల పరిషత్ సమావేశంలో అక్రమాలు జరిగాయంటూ సభలో పలు అక్రమాలపై నిలదీశారు. దీంతో ఎంపీడీఓ, ఏపీడీ పద్మశ్రీ, ఏపీఓ కొండయ్యతో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. నేతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీకి క్షేత్రసమాయకుడు లేకపోవడంతో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. వలస వెళ్లిన వారికి మస్టర్లు వేయడం, పనులకు వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్న మరి కొంత మందికి మస్టర్లు వేసి కేలి నగదును చెరి సగం పంచుకుంటున్నందున కూలి గిట్టుబాటు కావడంలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మీ పంచాయతీకి క్షేత్ర సహాయకుడిని నియమించి మీ పర్యవేక్షణలో మేట్‌లను నియమించుకొని పనులు చేసుకొనేలా చర్యలు తీసుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కంభం: ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించేలా చూడాలని ఉపాధి హామీ పీడీ కె. శీనారెడ్డి అన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమం ఏర్పాటు చేసి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, ఎంపీడీఓ నర్సయ్య, ఏపీడీ భాస్కర్, ఏపీఓ ఏడుకొండలు, యస్.ఆర్.పి సుబ్బారావు, తులశీ నాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com